వామ్మో చలి

పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతున్నది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చలి ప్రభావం ఎక్కువగా ఉంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 10.5, ఆదిలాబాద్ జిల్లా పొచ్చెరలో 11.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా జిల్లాల్లోనూ ఇదేస్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏపీలోని పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో మంచింగిపుట్టులో 9, మినుమూలూరులో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రత దృష్ట్యా చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

నేడు గ్రూప్-1పై హైకోర్టులో విచారణ

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): వివాదాలమయంగా మారిన గ్రూప్-1పై హైకోర్టు బుధవారం విచారించనున్నది. మొత్తం నాలుగు కేసులు ధర్మాసనం ఎదుట విచారణకు రానున్నాయి. జీవో-29, పీహెచ్, ట్రాన్స్‌జెండర్ రిజర్వేషన్, లోకల్, నాన్ లోకల్ అంశాలపై అభ్యర్థులు వేసిన పిటిషన్లను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించనుంది. ఇప్పటికే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ముగిశాయి. బుధవారం హైకోర్టులో విచారణ నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే కొన్ని అంశాలపై వాదనలు ముగియగా, కోర్టు తీర్పు తమకే అనుకూలంగా వస్తుందని పిటిషనర్ రాంబాబు అభిప్రాయపడ్డారు.

టెట్ దరఖాస్తుకు నేడే ఆఖరు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తుల గడువు బుధవారంతో ముగియనుంది. దరఖాస్తు చేసుకోనివారు బుధవారం వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు టెట్‌కు 2.07లక్షలకుపైగా దరఖాస్తులొచ్చాయి. అయితే టెట్ దరఖాస్తుల గడువును రెండు, మూడు రోజులు పొడిగించాలని బీఎడ్, డీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి కోరారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌లో హడలెత్తిస్తున్న పులులు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తేతెలంగాణ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పులులు హడలెత్తిస్తున్నాయి. ఒకవైపు మగ పులి, మరోవైపు ఆడపులి తోడు కోసం వందల కిలోమీటర్ల ప్రయాణం చేస్తున్నట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రయాణంలో అడ్డొచ్చిన ఆవులు, ఎద్దులపై దాడి చేసి ఆకలి తీర్చుకుంటున్నాయి. మెటింగ్ సీజన్ కావడంతో ఆ రెండు కలుస్తాయని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి నిర్మల్, బోథ్ సరిహద్దు మండలాల్లోకి ప్రవేశించిన పులి జానీగా అటవీశాఖ అధికారులు గుర్తించారు. గత నెల 23న తెలంగాణలోకి ప్రవేశించి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల అడవుల్లో సంచరిస్తున్నట్టు తెలిపారు. మరోవైపు రెండు నెలల క్రితం కుమ్రం భీం జిల్లా కెరమెరి అడవుల్లోకి వచ్చిన ఆడపులి జోడేఘాట్ అడవుల్లో సంచరించింది. ప్రస్తుతం రెండు పులులు సమీపానికి చేరుకున్నట్టు అధికారులు గుర్తించారు. కేవలం పదుల కిలోమీటర్ల దూరంలోనే రెండు పులులు సంచరిస్తున్నట్టు తెలిపారు.

ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి రాజీనామా

వరంగల్ చౌరస్తా, నవంబర్ 19: ఎంజీఎం సూపరింటెండెంట్ బాధ్యతలకు డాక్టర్ చిలుక మురళి రాజీనామా చేసిన విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం రాత్రి తన రాజీనామా పత్రాన్ని డీఎంఈకి అందజేసినట్టు మురళి తెలిపారు. అనారోగ్య కారణాలతో సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు ఆయన తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. గత సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ములుగు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ కావడంతో జూలై 23న డాక్టర్ మురళి ఎంజీఎం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన రాజీనామాను డీఎంఈ అంగీకరించకపోవడంతో ఈ విషయాన్ని గోప్యంగా ఉంచినట్టు తెలిపారు. ఎంజీఎం డైట్ కాంట్రాక్టు టెండర్ ప్రక్రియలో ఇద్దరు అధికారులు చేసిన తప్పులు బయటపడ్డాయి. ఈ విషయమై ఉన్నతాధికారులు సీరియస్ కావడంతోనే ఆయన రాజీనామా చేసినట్టు పలువురు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

ప్రజలపై 10వేల కోట్ల భారం!

- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి నిర్ణయం
- మార్కెట్ ధరలో 14% చార్జీలు వసూలు
- మున్సిపాలిటీల నుంచే 7వేల కోట్ల రూపాయల లక్ష్యం
- మున్సిపల్ కమిషనర్లకు రోజువారీగా టార్గెట్లు
- ఖజానా నింపుకునే ప్రయత్నంలో రేవంత్ సర్కార్

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిండుకున్న ఖజానా నింపుకోవడానికి రేవంత్‌రెడ్డి సర్కారు పడరాని పాట్లు పడుతున్నది. ఆరు గ్యారెంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల సమీకరణ అనివార్యమైంది. ఇందుకోసం ఆదాయ మార్గాలపై అన్వేషణ ప్రారంభించింది. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేసిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ అదే ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)ను తెరపైకి తెచ్చారు. మార్కెట్ ధరలపై 14శాతం ఎల్ఆర్ఎస్ చార్జీలు వసూలు చేయాలని భావించింది. ఎల్ఆర్ఎస్ పరిష్కారం ద్వారా దాదాపు రూ.10 వేల కోట్లకు పైగానే ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సర్కారు సంకల్పించింది. మున్సిపాలిటీ పరిధిలోనే దాదాపు రూ.7000 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్లకు టార్గెట్లు

ల్యాండ్ రెగ్యులరైజేషన్ కోసం 2020లో స్వీకరించిన మొత్తం 25.70 లక్షల దరఖాస్తులను ఒక్కొక్కటిగా క్లియర్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 3 నెలల క్రితమే జీవో జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు కష్టపడి పని చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పైగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా టార్గెట్లను నిర్ణయించారు. ఇతర పనులు పక్కన పెట్టి ఆదాయం వచ్చే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. దీంతో మున్సిపల్ అధికారులు ప్రతి రోజు అదే పనిలో నిమగ్నంకానున్నారు. 129 మున్సిపాలిటీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లు కలిపి మొత్తం 142 మున్సిపాలిటీ పరిధిలో ఎల్ఆర్ఎస్ త్వరితగతిన పరిష్కరించాలని కంకణం కట్టుకున్నారు. ఆ మేరకు చార్జీలు వసూలు చేయాలని ఉన్నతాధికారులు ప్రతి రోజు ఫాలో అప్ చేస్తున్నారు. ఒక పక్క కులగణన సర్వే కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్లు, అధికారులు, సిబ్బంది మొత్తం నిమగ్నమయ్యారు. మరో పక్క ఎల్ఆర్ఎస్‌ను పరిష్కరించాలని అదే ప్రభుత్వం ఆ శాఖ అధికారులపై ఒత్తిడి పెంచారు. మధ్యలో తాము నలిగిపోతున్నాయని ఆ శాఖ అధికారులు, సిబ్బంది ప్రభుత్వ విధానాలపై అసహనం వ్యక్తంచేస్తున్నారు.

ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు

- ఆగస్టు 2020లో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తుల స్వీకరణ
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల ఆధ్వర్యంలో దాదాపు 25.70 లక్షల దరఖాస్తులు స్వీకరించిన గత సర్కారు
- మున్సిపల్ శాఖలో మొత్తం 13.82 లక్షలు దరఖాస్తుల స్వీకరణ
- కాంగ్రెస్ సర్కారులో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి మార్చి 31 వరకు గడువు
- వాటిలో ఇప్పటి వరకు 10000 దరఖాస్తులకు మాత్రమే పరిష్కారం
- దాని వల్ల కేవలం రూ.115 కోట్ల వరకు ఆదాయం సమీకరణ
- అంటే 0.65 శాతం దరఖాస్తుల మాత్రమే పరిష్కారం
- గడువులోగా దరఖాస్తుల పరిష్కారంపై అధికారుల ఆందోళన

చనిపోయిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు

- విచారణ చేయకుండా ఎలా నమోదు చేస్తారని ఫైర్
- నర్సాపూర్ పోలీసుల తీరుపై తండావాసుల విమర్శలు

మృతుడి ఫొటో, డెత్ సర్టిఫికెట్‌ను చూపిస్తున్న కుటుంబ సభ్యులు

నర్సాపూర్, నవంబర్ 19: మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నారాయణపూర్ శివారు లచ్చిరాం తండా భూవివాదంలో చనిపోయిన వ్యక్తిపై స్థానిక పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసుల తీరుపై తండావాసులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. తండాలోని 200 సర్వేనెంబర్ భూమి విషయంలో కొన్నేండ్లుగా తండావాసుల మధ్య వివాదం నడుస్తున్నది. రెండు నెలల క్రితం తండాకు చెందిన దేవ్‌సింగ్, సూర్య, ఆంజనేయులు, విఠల్‌పై ఇంకోవర్గం వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పాత్‌లోత్ విఠల్ అనే వ్యక్తి ఏడేండ్ల క్రితం చనిపోయాడు. ఎలాంటి విచారణ చేపట్టకుండా అతనిపై ఏ4 ముద్దాయిగా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. చనిపోయిన వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో ఎలా చేర్చుతారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. భూవివాదంలో పోలీసులు తమ ప్రత్యర్థికి అనుకూలంగా వ్యవహరిస్తూ పూర్తి వివరాలు తెలుసుకోకుండా కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేశారని బాధితుడు దేవ్‌సింగ్ ఆరోపించాడు. ఈ విషయంపై ఎస్సై లింగంను వివరణ కోరగా.. కేసు విషయంలో ఫిర్యాదుదారులు పది మందిపై ఫిర్యాదు చేశారని, అందులో విఠల్ అనే వ్యక్తి పేరు ఉందని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణ చేపట్టామని, విచారణకు వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు విఠల్ ఇంట్లో లేడని, బయటకు వెళ్లాడని కుటుంబసభ్యులు చెప్పారనని వివరించారు. విఠల్ చనిపోయాడని విచారణలో తేలిందని, డెత్ సర్టిఫికెట్ సేకరించామని, పేరు తొలిగించి చార్జీషీటు వేస్తామని ఎస్సై పేర్కొన్నారు.

ఏసీబీకి చిక్కిన అంతర్గాం తహసీల్దార్

- ఇసుక ట్రాక్టర్ విడిచిపెట్టేందుకు రూ.12 వేల లంచం డిమాండ్
- ఆర్ఐ ద్వారా తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుబడిన రమేశ్
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరారు, తహసీల్దార్ అరెస్ట్.. రిమాండ్

ఏసీబీ అధికారులకు పట్టుబడిన అంతర్గాం తహసీల్దార్ రమేశ్

అంతర్గాం, నవంబర్ 19: పట్టుబడిన ఇసుక ట్రాక్టర్ విడిచిపెట్టేందుకు రూ.12 వేల లంచం తీసుకుంటూ తహసీల్దార్ ఏసీబీకి అధికారులకు చిక్కాడు. ఈ ఘటన మంగళవారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. ఈ మేరకు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి వివరాలు వెల్లడించారు. రామగుండానికి చెందిన ఆలకుంట మహేశ్ తన ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా మూడు రోజుల కింద పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. దీంతో మహేశ్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి జరిమానా చెల్లిస్తా .. తన ట్రాక్టర్ అప్పగించాలని కోరాడు. ఇందుకు తహసీల్దార్ రమేశ్ రూ.50 వేలు లంచం డిమాండ్ చేశాడు. అన్ని డబ్బులు తాను ఇచ్చుకోలేనని చెప్పడంతో చివరకు రూ.25 వేలు ఇస్తే వదిలిపెడుతామని తహసీల్దార్ చెప్పాడు. దీంతో మహేశ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు బాధితుడికి రహస్య కెమెరా ఇచ్చి ఫైనల్ సెటిల్‌మెంట్ కోసం తహసీల్దార్ వద్దకు పంపించారు. చివరకు రూ.12 వేలు ఇస్తే వదిలేస్తానని తహసీల్దార్ రమేశ్ తేల్చిచెప్పాడు. అందుకు మహేశ్ కూడా అంగీకరించాడు. ఈ మాటలన్నీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అనుకున్నట్టుగా మంగళవారం మహేశ్ రూ.12 వేలు తీసుకొని తహసీల్దార్ వద్దకు వెళ్లాడు. ఆ డబ్బులు ఆర్ఐ శ్రీధర్‌కు ఇవ్వాలని తహసీల్దార్ చెప్పడంతో మహేశ్ వెళ్లి ఆర్ఐకి ఇచ్చాడు. అదే టైంలో ఏసీబీ అధికారులు ఎంట్రీ ఇవ్వడంతో ఆర్ఐ వెంటనే ఆ డబ్బులను బయట పడేసి అక్కడి నుంచి పరారయ్యాడు. తహసీల్దార్ రమేశ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని, ఆర్ఐని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

రిజర్వేషన్ల ఎత్తివేతకు కాంగ్రెస్ కుట్ర

- గ్రూప్-1 మెయిన్స్ ఎంపిక ప్రక్రియలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పక్కనబెట్టే యత్నం
- జీవో-29ను వెంటనే రద్దు చేయాలి
- నిరుద్యోగ జేఏసీ నాయకుల డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్

ఖైరతాబాద్, నవంబర్ 19 : రాష్ట్రంలో రిజర్వేషన్ల ఎత్తివేతకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని నిరుద్యోగ జేఏసీ నాయకులు ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు జనార్దన్, ఇందిరానాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఏదో ఒరగబెడుతుందని భావించి ఓట్లు వేశామని, ఇప్పుడు అది తప్పని తేలిందని పేర్కొన్నారు. గ్రూప్-1 మెయిన్స్ ఎంపిక ప్రక్రియలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పక్కనబెట్టే కుట్రలు చేస్తున్నారని, తద్వారా ఎస్సీ, ఎస్టీ బీసీలకు తీవ్ర అన్యాయం జరుగనున్నదని ఆరోపించారు. ఏ ఉద్యోగానికైనా పరీక్షల స్థాయి నుంచి ఉద్యోగం వరకు తొలుత ఓపెన్ మెరిట్ లిస్టు, ఆ తర్వాత రూల్ ఆఫ్ రిజ్వేషన్లు అమలుచేయాల్సి ఉంటుందని, కానీ ఫలితాలు రాగానే ఒకే మెరిట్ లిస్టు ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రే అనేక సభలు, సమావేశాల్లో వెల్లడిస్తున్నట్టు తెలిపారు. ఇది ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులను ఉద్యోగాలకు దూరం చేయడమే అవుతుందని, గ్రూప్-1 లోనూ ఇదే జరుగుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని రక్షిస్తామంటూ దేశవ్యాప్తంగా తిరుగుతున్న రాహుల్‌గాంధీ.. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మెగా డీఎస్సీ, గ్రూప్ పోస్టుల పెంపు, నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తారని చెప్పి ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు అదే రిజర్వేషన్లను రద్దు చేసే పన్నాగం పన్నుతున్నట్టు ఆరోపించారు. నిరుద్యోగులపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే జీవో-29 రద్దుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు డాక్టర్ నర్సింహ, హరినాయక్, విజయ్‌రెడ్డి, నరేందర్, మహేశ్ గౌడ్, యుగేంధర్, అభినవ్, అర్జున్, శివానంద, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కోస్గి ఇంజినీరింగ్ కాలేజీకి అనుమతులొచ్చేనా..?

వసతుల్లేకపోవడంతో ఏఐసీటీఈ అనుమతులపై సందిగ్ధత

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): సీఎం సొంత నియోజకవర్గంలో ప్రారంభించిన కోస్గి ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీకి అనుమతులొచ్చేనా..? వచ్చే విద్యాసంవత్సరానికి ఏఐసీటీఈ ఈ కాలేజీకి అనుమతులిస్తుందా..? అంటే అనుమానంగానే కనిపిస్తున్నది. ఈ కాలేజీకి ఇప్పటి వరకు సొంత భవనం లేకపోవడం, స్థల సేకరణ జరగకపోవడంతో అనుమతులపై నీలినీడలు కమ్ముకున్నాయి. నిరుడు కోస్గి పాలిటెక్నిక్ కాలేజీని ఇంజినీరింగ్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేశారు. పాలిటెక్నిక్ కాలేజీ పక్కనున్న ఐదారెకరాల స్థలాన్ని కేటాయించాలని అధికారులు ప్రతిపాదించారు. దీని పైనా ప్రభుత్వం ఏదీ తేల్చడంలేదు. వసతులు, పూర్తిస్థాయి పోస్టులను మంజూరుచేయలేదు. వీటన్నింటి ప్రభావం ఏఐసీటీఈ అనుమతులపై పడుతుందని అధికారులు కలవరపడుతున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ జీవో రద్దు

- ఇకపై అన్ని ఉద్యోగాలను నోటిఫికేషన్లతోనే భర్తీ చేయాలని హైకోర్టు స్పష్టీకరణ
- ఇప్పటివరకు క్రమబద్ధీకరించిన ఉద్యోగులను యథాతథంగా కొనసాగించాలని తీర్పు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ 2016లో జారీచేసిన జీవో 16ను హైకోర్టు రద్దు చేసింది. డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కాలేజీల్లో కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరణ కోసం ఉద్యోగనియామక చట్టాన్ని సవరించడం ద్వారా సెక్షన్ 10ఏ ప్రకారం తీసుకొచ్చిన ఆ జీవోను కొట్టివేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఈ క్రమబద్ధీకరణ ప్రక్రియ జరిగిందని పేర్కొంటూ పలువురు నిరుద్యోగులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర రావు ధర్మాసనం మంగళవారం 40 పేజీల తీర్పును వెలువరించింది. జీవో 16 ప్రకారం ఇప్పటికే క్రమబద్ధీకరణ అయిన ఉద్యోగులను తొలగించవద్దని, వారిని రెగ్యులర్ ఉద్యోగులుగానే కొనసాగించాలని స్పష్టం చేసింది. ఇకపై అన్ని ఉద్యోగాలను చట్టప్రకారమే భర్తీ చేయాలని తెలిపింది. ఇక నిరుద్యోగుల పిటిషన్లపై విచారణ ముగిసినట్టు ప్రకటించింది.

హైకోర్టు తీర్పు చారిత్రాత్మకం: కనకచంద్రం

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): క్రమబద్ధీకరించబడిన కాంట్రాక్ట్ లెక్చరర్లకు అనుకూలంగా హైకోర్టు తీర్పునివ్వడాన్ని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం స్వాగతించారు. ఈ తీర్పు చారిత్రాత్మకమని పేర్కొన్నారు. నిరుద్యోగ సంఘాల పేరుతో కొందరు కోర్టు నాశ్రయించారని, కానీ మొత్తంగా న్యాయం గెలిచిందని అభిప్రాయపడ్డారు. తీర్పుతో 5 వేలకు పైగా ఉద్యోగులకు కొత్త జీవితాన్ని ప్రసాదించినట్టయిందని పేర్కొన్నారు. అధికారులు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

టీఎస్‌వోఏ అధ్యక్షుడిగా సురేశ్‌కుమార్

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీఎస్‌వోఏ) అధ్యక్షుడిగా డాక్టర్ జీ సురేశ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన రెవెన్యూ శాఖలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. సంఘానికి తాజాగా జరిగిన ఎన్నికల్లో 19 మందితో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసిస్టెంట్ సెక్రటరీ నుంచి అడిషనల్ సెక్రటరీ క్యాడర్ వరకు అధికారులు తమ ఓటును వినియోగించుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పీ లింగమూర్తి గెలుపొందారు. ముగ్గురు వైస్ ప్రెసిడెంట్లు, ఏడుగురు కార్యదర్శులు, కోశాధికారి, ఐదుగురు ఈసీ మెంబర్లను ఎన్నుకున్నట్టు వెల్లడించారు.

గడువు తీరిన సీఎంఆర్ఎఫ్ చెక్కులు

- సమయానికి అందకపోవడంతో ఇబ్బందులు

మెట్‌పల్లి, నవంబర్ 19: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు లబ్ధిదారులకు సమయానికి అందడం లేదు. చెక్కులు చేతికందినా గడువు ముగియడంతో ప్రయోజనం లేకుండా పోతున్నది. కొత్త వాటి కోసం గడువు ముగిసిన చెక్కులను తిరిగి సీఎం పేషీకి పంపించక తప్పడం లేదు. కొద్ది రోజుల కిందట ఇ బ్రహీంపట్నం డబ్బ గ్రామానికి చెంది న ఓ మహిళకు సీఎం ఆర్ఎఫ్ కింద రూ.15 వేలు మంజూరయ్యాయి. వాటికి సంబంధించిన చెక్కును 2024 జూలై 12న జారీ చేశారు. కానీ, లబ్ధిదారు చేతికి మాత్రం 4 నెలల తర్వాత అందింది. ఆమె 14 నెలల కింద వైద్యానికి రూ.1.50 లక్షలు ఖర్చవగా అంత మొత్తానికి సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం రూ.15 వేలు మాత్రమే మంజూరయ్యాయి. అదే గ్రామానికి చెందిన మరో మహిళది అదే పరిస్థితి. ఆమెకు రూ.36 వేలు చెక్కు వచ్చినప్పటికీ జారీ చేసిన నిర్ణీత గడువులోపల చేతికందకపోవడంతో మళ్లీ దాని స్థానంలో కొత్త చెక్కు కోసం తిరిగి పంపినట్టు తెలిసింది.

అప్పుల వేటలో సివిల్ సప్లై

- రూ. 14వేల కోట్ల రుణం తీసుకోవాలని నిర్ణయం
- మార్క్‌ఫెడ్ ద్వారా ఎన్‌సీడీసీ రుణం కోసం ప్రయత్నం
- రూ. 5వేల కోట్లు మంజూరు.. మరో 5వేల కోట్ల కోసం వినతి
- ధాన్యం కొనుగోలుకు నిధుల కొరత
- అప్పు పుడితేనే రైతులకు ధాన్యం పైసలు
- అప్పులు తగ్గిస్తున్నామంటూనే వేల కోట్ల అప్పులు
- సివిల్‌సప్లై అధికారులు, మంత్రి ఉత్తమ్ వైఖరిపై విమర్శలు

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోలుకు పైసలు కరువయ్యాయి. ప్రభుత్వం పైసలు ఇవ్వకపోవడం, సివిల్ సప్లై వద్ద చిల్లిగవ్వ లేకపోవడంతో నిధుల కటకట తప్పడం లేదు. అప్పు చేస్తే గానీ రైతులకు ధాన్యం పైసలు ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో గత్యంతరం లేనిపరిస్థితుల్లో సివిల్‌సప్లై అప్పులవేటలో పడింది. ప్రస్తుతానికి రూ.14వేల కోట్ల అప్పు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నది. పలు జాతీయ సంస్థలు సివిల్‌సప్లైకి నేరుగా అప్పులిచ్చే పరిస్థితి లేకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించినట్టుగా తెలిసింది. ఇందులో భాగంగానే మార్క్‌ఫెడ్ ద్వారా నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) నుంచి రుణం తీసుకోవాలని నిర్ణయించింది. మొత్తం రూ. 14 వేల కోట్ల అప్పు కోసం దరఖాస్తు చేసినట్టుగా తెలిసింది. ఇందులో ఇప్పటికే రూ. 5వేల కోట్లను ఎన్‌సీడీసీ మంజూరు చేసినట్టుగా తెలిసింది. ఇప్పుడు మళ్లీ కొత్తగా మరో రూ. 5వేల కోట్ల విడుదలకు దరఖాస్తు చేసినట్టుగా తెలిసింది. ఇప్పుడు ఈ పైసలు వస్తే గానీ రైతులకు చెల్లింపులు చేసే పరిస్థితి లేదని తెలిసింది.

రైతులకు చెల్లింపులు 'సగమే'

ధాన్యం కొనుగోలుకు నిధుల కొరత లేదని సివిల్ సప్లై అధికారులు చెబుతున్నా.. వాస్తవ లెక్కలు మాత్రం అధికారుల మాటలు ఉత్తవేనని చెబుతున్నాయి. సివిల్‌సప్లై అధికారుల అధికారిక లెక్కల ప్రకారం ఈ నెల 17వ తేదీ వరకు రైతుల నుంచి రూ. 3 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా, రైతులకు మాత్రం రూ.1500 కోట్లు మాత్రమే చెల్లించింది. అంటే ఇంకా సగం బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. మరో వైపు నిధుల కొరతతోనే సన్న ధాన్యం రైతులకు బోనస్ అందడం లేదు. ఇప్పటి వరకు 3 లక్షల టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఇందుకు రైతులకు క్వింటాలుకు మద్దతు ధర రూ. 2320, బోనస్ రూ. 500 కలిపి మొత్తం రూ. 2820 చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధంగా 3 లక్షల టన్నులకు గానూ రూ. 84.60 కోట్లు రైతులకు బోనస్ కింద చెల్లించాల్సి ఉంది. ఇప్పటివరకు రైతులకు రూ. 9 కోట్లు మాత్రమే చెల్లించినట్టు అధికారులు వెల్లడించారు. అంటే సన్న ధాన్యం రైతులకు ఇంకా రూ. 75.60 కోట్లు పెండింగ్‌లో ఉండడం గమనార్హం.

అప్పులు తగ్గిస్తున్నామని.. మళ్లీ అప్పులు

సివిల్‌సప్లైలో గత ప్రభుత్వం భారీగా అప్పులు చేసిందని, ఆ అప్పులను తాము తగ్గిస్తున్నట్టుగా సివిల్‌సప్లై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడే నాటికి రూ. 58వేల కోట్ల అప్పులుంటే.. వీటిని రూ. 47వేల కోట్లకు తగ్గించినట్టుగా తెలిపారు. ఎంతో కష్టపడి సివిల్‌సప్లై అప్పుల భారాన్ని తగ్గిస్తున్నట్టుగా గొప్పలు చెబుతున్న మంత్రి, అధికారులు ఇప్పుడు మళ్లీ అప్పుల కోసం వెంపర్లాడడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓవైపు అప్పులు తగ్గిస్తున్నామని చెబుతూనే.. మళ్లీ అప్పులు చేయడం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

1,260 కోట్ల దోపిడీకి స్కెచ్!

మొదటిపేజీ తరువాయి...

కోరుతుండగా.. ప్రభుత్వం మాత్రం రూ.75 వరకు చెల్లించేందుకు సిద్ధపడుతున్నట్టు త